క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నెల్లికుదురు : పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సాంస్కృతిక సారధి మెరుగు రవీందర్ గౌడ్ ప్రజలను కోరారు. ఈ మేరకు జిల్లా అధికారుల ఆదేశాలతో సోమవారం మండలంలోని తారాలింగ్‌బావి తండాలో ఆటాపాటలతో కళాజాత ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.

కార్మికులను క్రమబద్ధీకరించాలి



తొర్రూరు : మున్సిపాలిటీ కార్మికులను క్రమబద్ధీకరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు బొల్లం అశోక్, కొమ్ము దేవేందర్ కోరారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం డివిజన్ కేంద్రంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డిలకు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సేవలను థర్డ్ పార్టీకి అప్పగించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు జమ్ముల శ్రీనివాస్, అర్వపల్లి వెంకన్న, రాజశేఖర్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

క్షుద్రపూజల కలకలం

కురవి: మండల కేంద్రంలోని తిర్మలాపురం వెళ్లే ప్రధాన రహదారిపై క్షుద్రపూజలు సోమవారం కలకలం రేపింది. కోడి నర్సయ్య ఇంటి ఎదుట ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇస్తారాకులో కుంకుమ కలిపిన అన్నం, కోడిగుడ్లు, ఇతర సామగ్రి పెట్టి పూజలు చేసి రోడ్డుపై పెట్టారు. ఉదయాన్నే లేచిన ఇంటియజమాని ఈ దృశ్యం చూసి నిర్ఘాంతపోయాడు. ఇలాంటి చేష్టల వల్ల కాలనీ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలి

తొర్రూరు: ప్రతీ ఒక్కరూ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని శివయాద్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకురాలు నడిగడ్డ శైలజ అన్నారు. స్థానికులు నడిగడ్డ శివాని జయంతిని పురస్కరించుకుని ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం డివిజన్ కేంద్రంలోని వందేమాతరం ఫౌండేషన్‌లో విద్యార్థులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు అందించారు. కార్యక్రమంలో ట్రస్టు గౌరవ అధ్యక్షుడు జలకం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్ పాల్గొన్నారు.

రజక సంఘం పట్టణ కమిటీ ఎన్నిక

నెహ్రూసెంటర్ : రజక సంఘం మహబూబాబాద్ పట్టణ నూతన కమిటీని జిల్లా కేంద్రంలోని చాకలి ఐలమ్మ భవన్‌లో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దోసపాటి వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా సట్ల రాజు, లాండ్రీ షాపుల పట్టణ అధ్యక్షుడిగా చెన్నూరు వెంకన్న ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ రజకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుగ్గి గోపాల్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు నిమ్మల శ్రీనివాస్, సీనియర్‌నాయకులు చంద్రయ్య, వెంకన్న, శేఖర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వినియోగదారులు ఈకేవైసీ చేయించుకోవాలి

మహబూబాబాద్: జిల్లాలోని హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులంతా తప్పకుండా ఈకేవైసీ చేయించుకోవాలని హెచ్‌పీ గ్యాస్ డీలర్ సురేశ్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ కొత్తనిబంధనల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులతో సహా వినియోగదారులంతా ప్రస్తుతం గ్యాస్‌ను వాడుకుంటున్నట్లు ధ్రువీకరణకుఈ కేవైసీ చేయించుకోవాలన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం

కేసముద్రం: రుణమాఫీ చేస్తామని ఎన్నికల ముందు రైతులకు మాట ఇచ్చిన ప్రకారంగా, రాష్ట్ర ప్రభుత్వం ఆ మాటను నిలబెట్టుకుందని కేసముద్రం, ఇనుగుర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షులు అల్లం నాగేశ్వర్‌రావు, కూరెల్లి సతీష్ అన్నారు. సోమవారం మండల కేంద్రాల్లో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేస్తున్నట్లు ప్రకటించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు గుగులోతు దస్రూనాయక్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్ రెడ్డి, సురేందర్, పట్టణ అధ్యక్షుడు మురళీ, ఎండీ.అయూబ్‌ఖాన్, వసంతరావు, వెంకటేష్, బాబురావు, కట్టయ్య, మహేందర్, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

● పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు: కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్మించిన హరిహర ముక్తిధామంలో అదనపు వసతులు, అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి ఎమ్మెల్యే మాట్లాడారు. తొర్రూరును రాష్ట్రంలోనే ఉత్తమ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని తెలిపారు. మున్సిపాలిటీలో అవసరమైన సౌకర్యాల కల్పనకు నిధులు వెచ్చిస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో అర్హులందరికీ ఐదేళ్లలో సొంత ఇంటి కల సాకారం చేస్తామన్నారు. అర్హులైన వారికి ఆసరా పింఛన్లు, కొత్త రేషన్‌కార్డులు త్వరలో రానున్నాయని తెలిపారు. అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం పంచాయతీరాజ్ శాఖపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కొనసాగుతున్న పనులు, ప్రతిపాదనలపై ఆరా తీశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు డాక్టర్ రాజేందర్‌రెడ్డి, తమ్మెర లక్ష్మీనరసింహారావు, విజయ్‌పాల్‌రెడ్డి, కమిషనర్ శాంతికుమార్, కాంగ్రెస్ నాయకులు సుంచు సంతోష్, రాజశేఖర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

దండోరా రజతోత్సవాలను జయప్రదం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కొండ్ర ఎల్లయ్య

నెహ్రూసెంటర్ : హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జూలై 7న జరగనున్న మాదిగల దండోరా రజతోత్సవాలను జయప్రదం చేయాలని ఎంఆర్‌పీఎస్ జాతీయ కార్యదర్శి కొండ్ర ఎల్లయ్య పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగల హక్కుల సాధన, వర్గీకరణకై ఏర్పడిన దండోరా ఉద్యమం 30 ఏళ్లుగా పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో ఉద్యమ నాయకులకు సన్మానం ఉంటుందని, కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహా హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఉత్సవాలకు మాదిగ, మాదిగ ఉపకులాలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో దేవి, ఉపేందర్, వీరన్న, భాస్కర్, సాంబయ్య, సుధా, రాధా, సమ్మయ్య, సంధ్య, రమా, రజిత పాల్గొన్నారు.

నిలిచిన బీఎస్‌ఎన్‌ఎల్ సేవలు

డోర్నకల్: వెన్నారం సమీపంలో ఓఎఫ్‌సీ కేబుల్ వైరు తెగడంతో డోర్నకల్‌తో పాటు పలు ప్రాంతాల్లో బీఎస్‌ఎన్‌ఎల్ సేవలు నిలిచిపోయాయి. వెన్నారం, రాముతండా మార్గంలో ఓ రైతు రోడ్డుపక్కన ప్రొక్లెయినర్ వాహనంతో తవ్వకాలు జరపడంతో బీఎస్‌ఎన్‌ఎల్ ఓఎఫ్‌సీ వైర్లు తెగిపోయాయి. దీంతో డోర్నకల్, మంగళగూడెం, ఎం.వెంకటాయపాలెం ప్రాంతాల్లో బీఎస్‌ఎన్‌ఎల్ సేవలు నిలిచాయి. సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మరమ్మతు పనులు చేపట్టారు.

వేలాన్ని నిలిపివేయాలి

గార్ల : రాష్ట్రంలో సింగరేణి ప్రాంతంలో ఉన్నటువంటి ఆరు బొగ్గు గనుల వేలం పాట వేసే ప్రక్రియను వెంటనే నిలిపి వేయాలని తెలంగాణ జనసమితి రాష్ట్ర నాయకుడు గిన్నారపు మురళి కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం గార్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి ఆధ్వర్యంలో ఎన్నో పరిశోధనలు చేసి దాదాపు రూ.1200 కోట్లు ఖర్చు పెట్టి నూతనంగా కనుగొన్న 6 బొగ్గు గనులను ప్రధాని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులైన అంబాని, అదానీలకు అంటగట్టేందుకు కుట్రలు చేస్తుందన్నారు. వేలంను అడ్డుకునేందుకు ఇండియా కూటమి, వామపక్ష పార్టీలు ఆందోళనలు చేపట్టాలని కోరారు.

క్రషర్ మిల్లును సీజ్ చేయాలంటూ ధర్నా



తహసీల్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్తులు

కేసముద్రం: అర్పనపల్లి గ్రామ సమీపంలోని క్రషర్ కంకర మిల్లును వెంటనే సీజ్ చేయాలంటూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ క్రషర్ మిల్లులో ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా భారీ పేలుళ్లు జరిపారని, దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారంటూ ఆరోపించారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ, సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వారు ఆరోపించారు. సీజ్ చేయకపోతే కలెక్టర్ ఆఫీస్ ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం జరిగిన ఘటనపై తాము చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ దామోదర్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో పిట్టల మురళి, గంధసిరి సంతోష్, గంధం రమేష్, నరేష్, అశోక్, సురేష్, రాకేష్, వెంకటేష్, పవన్, భరత్, సంతోష్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మరిపెడ: గురుకుల పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని, అర్హులైన ప్రతి విద్యార్థికి న్యాయం చేయాలని యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి పెద్దబోయిన వీరబాబు అన్నారు. హైదరాబాద్‌లోని సోషల్ వెల్ఫేర్ కార్యాలయ సెక్రటరీకి కలిసి సమస్యలు వివరించినట్లు ఆయన తెలిపారు. గురుకులలో చదువుతున్న ప్రతి విద్యార్థికి సొంత జిల్లాకు ట్రాన్స్‌ఫర్ పెట్టుకున్న విద్యార్థులను వెంటనే పంపించాలన్నారు. ప్రతి విద్యార్థికి 20 శాతం అడ్మిషన్లు అధికంగా ఇవ్వాలని కోరారు. కైలాస్, సుధాకర్, శ్రీధర్, ప్రణయ్‌భవన్, శ్రీకాంత్, సుధీర్ ఉన్నారు.

అధిక ఫీజులను నియంత్రించాలి



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నానియాదవ్

డోర్నకల్: ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల వసూలును వెంటనే నియంత్రించాలని కాంగ్రెస్ యువజన నాయకులు దాసరి నానియాదవ్ డిమాండ్ చేశారు. అధిక ఫీజులను నియంత్రించాలని కోరుతూ సోమవారం జిల్లా కేంద్రంలో అడిషనల్ కలెక్టర్ డేవిడ్, డీఈఓ కె.రామారావును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నానియాదవ్ మాట్లాడుతూ ప్రైవేట్‌లో అధిక ఫీజుల వసూళ్లతో పేద విద్యార్థులు తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఫీజులు, పుస్తకాలు, ఇతరాల పేరిట పాఠశాలల యజమానుల అక్రమ వసూళ్లను వెంటనే అరికట్టి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సురేష్, సందీప్, మహేష్, ఇర్ఫాన్ ఉన్నారు.

ఉద్యమకారులకు అండగా ఉంటా



తొర్రూరు: జయలక్ష్మి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు



గూడూరు : దేవేందర్ కుటుంబానికి నగదు అందిస్తున్న సీఆర్‌టీలు

తొర్రూరు : తెలంగాణ మలిదశ ఉద్యమకారులకు అన్ని విధాలా అండగా ఉంటానని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. తెలంగాణ ఉద్యమకారుడు అల్లాబాబు తల్లి జయలక్ష్మి ఇటీవల మృతి చెందగా సోమవారం బాధిత కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలను లెక్క చేయకుండా ఎంతో మంది పోరాడారని, వారి హక్కుల కోసం పోరాడుతానని తెలిపారు. కన్నా,వెంకన్న, రమేష్, నరసింహరెడ్డి, అమల, సదాకర్, ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

గూడూరు : మండలంలోని మచ్చర్ల గ్రామానికి చెందిన చుంచ దేవేందర్ ఉపాధ్యాయుడు (సీఆర్‌టీ) గూడూరు బస్టాండ్ సెంటర్ మలుపులో ఇటీవల జరిగిన లారీ ప్రమాదంలో మృతి చెందాడు. ములుగు జిల్లా రాయినిగూడెం ఆశ్రమ పాఠశాలలో కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న దేవేందర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సీఆర్‌టీల రాష్ట్ర సంఘం అధ్యక్షుడు సోమేశ్వర్ పిలుపుతో ఉమ్మడి జిల్లా సంఘాల ఆదేశం మేరకు సోమవారం మహబూబాబాద్ జిల్లా సంఘానికి చెందిన ధారావత్ బాలాజీనాయక్ ఉమ్మడి వరంగల్ జిల్లాలో పనిచేస్తున్న సీఆర్‌టీలు అందరూ కలిసి రూ. 82,500 జమ చేసి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం దేవేందర్ భార్యకు ఉద్యోగంతో పాటు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కేసముద్రం: ఇనుగుర్తికి చెందిన పి.వీరమల్లు(75) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. మాలమహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు మన్నె బాబురావు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతదేహంపై పూలమాల వేసి సంతాపం తెలిపాడు. ఆయన వెంట రాష్ట్ర నాయకులు రవికుమార్, రాంచందర్, బీఆర్‌ఎస్‌పార్టీ గ్రామ అధ్యక్షుడు చంద్రయ్య, మాజీ సర్పంచ్ రామ్మూర్తి, శ్రీను ఉన్నారు. అలాగే మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ అయిలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా సోమవారం మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కేసముద్రం పీఏసీఎస్ చైర్మన్ వెంకన్న, చంద్రయ్య, తదితరులు ఉన్నారు. రోడ్డుప్రమాదంలో ఇటీవల గాయపడిన గూడూరు మండలం రాజన్‌పల్లికి చెందిన కోమటిరెడ్డి వేణుకు, సోమవారం కేసముద్రం మండల టాక్సీడ్రైవర్స్ అండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.20వేల ఆర్థికసాయాన్ని అందజేసినట్లు ఆ సంఘం మండల అధ్యక్షుడు పింగిలి సంతోష్ తెలిపారు. సంఘం కార్యదర్శి నాగుల్, నాగెల్లి సురేందర్, సిలువేరు గణేష్, రావుల అనిల్, బోడ రమేష్ అందజేశారు.

విద్యార్థులకు టై, బెల్టుల అందజేత

కేసముద్రం: మండలంలోని కల్వల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు టై,బెల్టులను సోమవారం ఉపాధ్యాయ బృందం అందజేసింది. కార్యక్రమంలో జెడ్పీహైస్కూల్ హెచ్‌ఎం బండారు నరేందర్, పీఎస్ హెచ్‌ఎం కల్లెం వీరారెడ్డి, ఏఏపీసీ చైర్మన్ మౌనిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదే విధంగా మండలంలోని రంగాపురం యుపీఎస్‌లో విద్యార్థులకు శ్రీరాం చంద్రన్‌కుమార్ వ్యాపారి రూ.8వేల విలువైన నోట్‌బుక్స్, పెన్నులను సోమవారం అందజేశాడు. కార్యక్రమమంలో హెచ్‌ఎం గోపాల శ్రీధర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు రూ. 6 వేల పింఛన్ ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న గుగ్గిళ్ల పీరయ్య

నెహ్రూసెంటర్ : కాంగ్రెస్ అధికారంలోకి రాగానే దివ్యాంగులకు రూ.6 వేలు పెంచి ఇస్తామని నేటి వరకు ఇచ్చిన హామీ అమలు చేయలేదని, పింఛన్ పెంచి ఇవ్వాలని ఎంఎస్‌పీ జాతీయ నాయకులు గుగ్గిళ్ల పీరయ్య, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్బూరి వినోద్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని మంద కొమురమ్మ నగర్‌లో వీహెచ్‌పీఎస్ జిల్లా కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పింఛన్ పెంపుపై దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత, బీడీ కార్మికులకు ఇచ్చిన హామీలని ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి నిలుపుకోవాలన్నారు. నేడు హైదరాబాద్‌లో జరగనున్న వీహెచ్‌పీఎస్ రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం జిల్లా అధికార ప్రతినిధి ఎండీ.పాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి మోగులూరి కుమార్, బుడిగె శ్రీరాములు, రుద్ర తిరుపతి, గుగులోత్ మోహన్, కృష్ణారెడ్డి, ఉప్పలయ్య, వెంకన్న, వెంకటేశ్వర్లు, వీరస్వామి, ప్రభాకర్, నారాయణ, శ్రావణ్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి : కలెక్టర్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

మహబూబాబాద్ రూరల్/మహబూబాబాద్ : విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. మండలంలోని రెడ్యాల ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మౌలిక వసతులు, భోజన సౌకర్యాలు ఎలా ఉన్నాయని విద్యార్థులతో మాట్లాడి తెలుసుకున్నారు. మంగళవారం వరకు ఆయా ప్రాంతాలలో లైట్లు, నల్లాలు ఏర్పాటు చేయాలని గిరిజన శాఖ ఉప సంచాలకులు ఎర్రయ్యను ఆదేశించారు.

సమయ స్ఫూర్తితో వ్యవహరించాలి

అధికారులు విధి నిర్వహణలో సమయ స్ఫూర్తితో వ్యవహరించాలనికలెక్టర్ అద్వైత్‌మార్ సింగ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో సోమవారం పలుశాఖల అధికారులతో జిల్లా అభివృద్ధి సంక్షేమ పథకాల అమలుపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజలతో మమేకమై విద్య, వైద్యం, పారిశుద్ధ్యంప పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హైదరాబాద్ స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపికలు



గూడూరు : విద్యార్థుల ఎంపిక నిర్వహిస్తున్న ఫిజికల్ డైరెక్టర్లు

గూడూరు: తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశం మేరకు హైదరాబాద్ హకీంపేటలోని స్పోర్ట్స్ స్కూల్‌లో 2024–25 సంవత్సరానికి 4వ తరగతిలో ప్రవేశానికై ఈ నెల 26న గూడూరు మండల స్థాయి ఎంపికలు బాలుర హైస్కూల్‌లో జరుగుతాయని ఎంఈఓశ్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో ఎంపికైన వారికి జూన్ 29న మహబూబాబాద్ ఎన్‌టీఆర్ స్టేడియంలో జిల్లాస్థాయి ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు.

కేసముద్రం: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో కేసముద్రం, ఇనుగుర్తి మండలాలకు చెందిన పిల్లలకు, మండలాల స్థాయి ఎంపిక పోటీలను నిర్వహించారు. ఎంపికైన బాల, బాలికలు ఈనెల 29న మానుకోట జరిగే జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొననున్నట్లు హెచ్‌ఎం రాజు తెలిపారు. కార్యక్రమంలో పీఈటీలు కొమ్ము రాజేందర్, శంకర్, విజయ్‌చందర్, పద్మ, రామన్న, శ్రీనివాస్, నసీరుద్దీన్, మధుకర్ పాల్గొన్నారు.

తెలంగాణ క్రీడాపాఠశాల ఎంపికలు

నెల్లికుదురు: మండల కేంద్రంలోని జెడ్పీఎస్‌ఎస్ ఆవరణలో సోమవారం తెలంగాణ క్రీడా పాఠశాల ఎంపికలు ఎంఈఓ రాము ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఎంపికలో 100 మంది పాల్గొనగా 40 మంది విద్యార్థులు 20 మంది బాలికలు, 20 మంది బాలురులను ఎంపిక చేశారు. ఈ నెల 29న జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్ స్టేడియంలో నిర్వహించే జిల్లా స్థాయి ఎంపికలో పాల్గొంటారని ఫిజికల్ డైరెక్టర్ సీహెచ్.అయిలయ్య తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ జి.సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్లు ఎండీ ఇమామ్, ఎస్.ప్రవీన్, కొమురయ్య పాల్గొన్నారు.

నేడు క్రీడా పాఠశాలకు ఎంపికలు

డోర్నకల్: క్రీడా పాఠశాలల్లో 4వ తరగతి ప్రవేశాలకు మంగళవారం స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో ఎంపికలు నిర్వహించనున్నారు. జిల్లా యూత్ స్పోర్ట్స్ అథారిటీ, కలెక్టర్ ఆదేశాల మేరకు డోర్నకల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉదయం 9.30 గంటల నుంచి ఎంపిక ప్రక్రియ ప్రారంభం కానుంది. ప్రవేశం కోసం 800 మీటర్ల పరుగు, 30 మీటర్ల ఫ్లెయింగ్ స్కార్ట్, షటిల్‌రన్, వర్టికల్ జంప్ తదితర పోటీ పరీక్షలు నిర్వహించనున్నారు. 4వ తరగతి విద్యార్థులు తమ బోనోఫైడ్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని ఎంఈఓ పూల్‌చంద్, ఎంఎస్‌డీఓ రవికుమార్ ఒక ప్రకటనలో కోరారు.

సంక్షిప్త సమాచారం

తొర్రూరు చెరువును డిజిటల్ సర్వే చేయాలి

తొర్రూరు: తొర్రూరు పెద్ద చెరువును డిజిటల్ సర్వే చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు మాలోతు సురేష్‌బాబు, ఏఐఎఫ్‌డీఎస్ నాయకులు అరుణ్‌కుమార్ కోరారు. అన్యాక్రాంతమవుతున్న పెద్ద చెరువును కాపాడాలని కోరుతూ బుధవారం డివిజన్ కేంద్రంలో డిప్యూటీ తహసీల్దార్‌కు ప్రజా సంఘాల నాయకులు వినతిపత్రం సమర్పించారు.

జనరల్ కౌన్సిల్‌కు తరలిరావాలి

కొత్తగూడ: ఈనెల 26న జిల్లా కేంద్రంలోని ముదిరాజ్ భవన్‌లో జరిగే ఏఐకేఎంఎస్ జనరల్ కౌన్సిల్‌కు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సంఘం నాయకులు సోమవారం తెలిపారు. మండలంలోని ముస్మిలో ఆ సంఘం నాయకులు వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.

నేడు వేలంపాట

గార్ల: మండలంలోని మర్రిగూడెంవేట వేంకటేశ్వర స్వామి దేవాలయంలో టెంట్‌సామగ్రి, కూల్‌డ్రింక్స్, కిరాణం దుకాణాలకు మంగలవారం వేలం నిర్వహించనున్నట్లు ఆలయం ఈఓ నందనం కవిత సోమవారం తెలిపారు. వేలంలో పాల్గొనేవారు టెంట్‌హౌజ్ నిర్వహించుకునేవారు ధరావత్తు సొమ్ముగా రూ.20,000 చెల్లించాలని, కూల్‌డ్రింక్స్, కిరాణం నడుపుకునే వారు రూ.10,0 వేలు చెల్లించి పాల్గొనాలని ఆమె సూచించారు.

పరిసరాలు పరిశుభ్రంగా చూసుకోవాలి

గూడూరు : ప్రతీ ఒక్కరు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా చూసుకుంటూ, శుక్రవారం, మంగళవారం డ్రైడేగా గుర్తించి పరిశుభ్రత పాటించాలని జెడ్పీ కో ఆప్షన్ ఎండి. ఖాసీం అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ వీ రస్వామి అధ్యక్షతన సీజనల్ వ్యాధులపై అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఆదర్శ పాఠశాలలో ఖాళీలకు ఆహ్వానం

నెల్లికుదురు: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 6, 7 తరగతుల్లో మిగిలి ఉన్న ఖాళీలను భర్తీ చేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న పరీక్ష నిర్వహించి 28న మెరిట్ ఆధారంగా సీట్లను భర్తీ చేస్తామన్నారు.

నాటుసారా స్వాధీనం

డోర్నకల్ : మండలంలోని చాప్లాతండాలో సోమవారం డోర్నకల్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఎస్సై తిరుపతి ఆధ్వర్యంలో పలు ఇళ్లలో తనిఖీలు నిర్వహించి భూక్యా పద్మ ఇంట్లో సు మారు 100 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి ఐదు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. నాటుసారా తయారు చేస్తున్న పద్మపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మోటార్ దొంగిలించారని ఫిర్యాదు

నెల్లికుదురు: వ్యవసాయ బావిలోని విద్యుత్ వాటర్ మోటార్‌ను దొంగిలించారని బాధితుడు చీకటి బీరయ్య తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 23న రాత్రి వ్యవసా య బావిలోని 3హెచ్‌పీ పీఎస్‌జీ విద్యుత్ మో టార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు పైపుకోసి నీటిలోంచి ఎత్తుకెళ్లినట్లు తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా డ్రెయినేజీల నిర్మాణం

తొర్రూరు: మున్సిపాలిటీలో నిబంధనలకు విరుద్ధంగా డ్రెయినేజీలు నిర్మిస్తున్నారని జెడ్పీఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలో కొనసాగుతున్న నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పనులు కొనసాగుతున్న తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నేషనల్ హైవే, ఆర్ అండ్ బీ అధికారుల అనుమతులు లేకుండానే మున్సిపాలిటీ అధికారులు పనులు కొనసాగించడం దారుణమన్నారు. ప్రజలను ఇబ్బంది పెట్టేలా అధికారులు, కాంట్రాక్టర్ వ్యవహరిస్తున్నాడన్నారు.

మెరుగైన సేవలందిస్తాం

డోర్నకల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు, చంటిపిల్లలు, గర్భిణులకు మెరుగైన సేవలందిస్తామని ఐసీడీఎస్ డోర్నకల్ ప్రాజెక్ట్ సీడీపీఓ ఎల్లమ్మ తెలిపారు. మండలంలోని బూరుగుపాడులో సోమవారం కార్యకర్తలకు ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఆమె ప్రా రంభించారు. ఈ సందదర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రణా ళికాబద్ధంగా సేవలందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

నెల్లికుదురు: ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య అందిస్తున్నామని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అరిగెకూటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం కళాశాలలో చేరిన విద్యార్థినీ, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించారు. కళాశాలలో విశాలమైన తరగతి గదులు, అధునాతనమైన లాబరేటరీలు, మానసిక ఉల్లాసానికి ఆటలతో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ సౌకర్యాలు ఉన్నాయన్నారు.

కార్మిక చట్టానికి చట్టబద్ధత కల్పించాలి

నెల్లికుదురు: 1948వ సంవత్సరంలో వ్యవసాయ కార్మిక చట్టం చేసి 76 ఏళ్లు కావస్తున్నా నేటి వరకు అమలుకు సాధ్యం కాలేదని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బండపల్లి వెంకటేశ్వర్లు, ముంజంపల్లి వీరన్న అన్నారు. అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్త కార్యక్రమంలో భాగంగా సోమవారం తహసీల్ కార్యాలయం ముందు నిరసన తెలిపి తహసీల్దార్ రాజుకు వినతిపత్రం అందించారు. దేశంలో 14 కోట్ల మంది వ్యవసాయ కార్మికులకు ఉపయోగపడే ఈ చట్టాన్ని ప్రతి రెండేళ్లకోసారి సవరణ చేస్తూ పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఆవిర్భావ మహాసభను విజయవంతం చేయాలి

మహబూబాబాద్ రూరల్ : హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జూలై 1న జరుగనున్న ఎల్‌హెచ్‌పీఎస్ 27వ ఆవిర్భావ మహాసభను విజయవంతం చేయాలని జిల్లా నాయకులు గుగులోత్ వెంకట్ నాయక్ కోరారు.మండలంలోని గడ్డిగూడెం శివారు సంధ్యతండలో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌హెచ్‌పీఎస్ వ్య వస్థాపక జాతీయ అధ్యక్షుడు తేజావత్ బెల్లయ్యనాయక్ పిలుపుమేరకు జరుగనున్న సభకు గిరిజన రైతులు, విద్యార్థులు, అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

నేడు వేంకటేశ్వరస్వామికి అభిషేకం

మహబూబాబాద్ రూరల్ : శ్రవణా నక్షత్రం, సంకష్టహర చతుర్థి సందర్భంగా స్థానిక శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో మంగళవా రం ఉదయం 8 గంటలకు శ్రీవేంకటేశ్వరస్వామి వారికి అభిషేకం నిర్వహిస్తామని ఆలయ ప్రధాన అర్చకులు ఎంవీ.కృష్ణప్రసాద్ సోమవారం తెలిపారు.

బైక్‌లోకి చొరబడిన పాము

డోర్నకల్ : మెయిన్‌రోడ్డులో నిలిపిన ఓ ద్విచక్ర వాహనంలోకి పాము చొరబడి కలకలం రేపింది. సురేఖ క్లాత్ స్టోర్ ఎదురుగా కొత్త వీరన్న తన ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేశాడు. రోడ్డు పక్కన ఖాళీ ప్లాట్‌లోని చెట్ల పొదల నుంచి పాము రోడ్డు దాటి వచ్చి అందరూ చూస్తుండగా బైక్ లోపలికి వెళ్లింది. స్నేక్ క్యాచర్ అనిల్ ఘటనా స్థలానికి చేరుకుని బైక్ నుంచి పామును బయటకు తీసి వదిలాడు.